మా కవిత్వము - నా విమర్శ

(హాస్యరచన)

●

— శ్రీ సామవేదుల సీతారామశాస్త్రి —

[గతిపంచిక తిరువాయి]

(తదనంతరము శ్రీ బిందుకవిగారు ప్రవేశిస్తారు.)

"అన్నట్లు! ఒక్క మాట. ఈ కవిత్వం ఉచ్చారణారాహిత్యం గల సంజ్ఞాయుతమైనదిగా బట్టి యిది చదివి వినిపించడానికి అసాధ్యమైనది. అందుచేత ఆ పద్యాలను శ్రీ బిందుకవిగారు యీ నల్లబల్లమీద వ్రాసి చూపిస్తారు."

(శ్రీ బిందుకవిగారు బల్లమీద యీ క్రింది విధంగా వ్రాస్తారు.)

"—?" '!.....' '!!!' (?).

"Excellent! Worthy of exp aining! Too much Praiseworthy! A thing that provides vast discussion—అన్నట్లు! ఇది ఆంధ్రపదమా! ఆహా! ఏం ఉన్నతమయినది! వ్యాఖ్యానానికి సరియైనది! ఎంతో హెచ్చుగా పొగడావసరం గలది. అనంతమైన భావాలు కుప్పలుగా కుప్పించు పుష్పగుచ్ఛము.

"మీ కిందులో ఏమైనా భావం తట్టిందా? అరె! అలా నోళ్లు వెళ్లబెట్టుకొని కళ్లు వెప్పజెప్పి చూస్తారేం! ఇంతటి అద్భుతభావసంద్రంలో ఒక్క సిటి బొట్టయినా మీ కళ్ల పళ్లేమా అంటే, మీకు దృష్టి లేదనే అనుకోవాలి. లేదా నాకు ఆ విధంగా కనపిస్తూ ఉండడంచేత నా దృష్టిలోపమనేనా అనుకోవాలి. నా దృష్టిపై నాకు దృఢవిశ్వాసం ఉన్నది గాబట్టి ఇది మీ లోపమే. మీ ఊహాప్రపంచంయొక్క సంకుచితత్వంవల్లనే అనుకుంటాను.

"మీ ఊహాలోకానికి గోడలు పడగొట్టండి. మానసికభావనకు రెక్కలు కట్టండి. భాషావిహంగానికి బంధనం తీసిపారెయ్యండి. అప్పుడే యిలాంటి సద్గ్రంథాలు అర్థం చేసుకోగలరు. అప్పుడే యిట్టి కావ్యాలను ఆనందించగలరు. అప్పుడే యీ విధమైన కృతులను తయారుచెయ్యగలరు.

"ఈ పైకావ్యం భగవద్గీతలోని సారమంతా తెలుపుతు చెప్తూంది. శ్రీకృష్ణప్రభుశేఖరుని సుందర ముఖారవిందప్రగీతామధుస్రవంతిని గ్రోలిన ఆ అర్జునుని యొక్క మానసికపరిస్థితిని తెలిపుడు చేస్తుంది.

"అదిగో! ఆ బల్లమీద చూడండి! ఆ అల్లికలో కొక్కసారి మీ దృష్టి సారించండి. మొదటి కొటేషన్లమధ్య నున్న "—?" మాకారా?...దీని భావం ఏమిటో తెలుసా?...రెండు సేనల మధ్యనున్న ఆ అర్జునునకు మనస్సు ఒక Blank, అంటే 'ఖాళీ' అయిపోయి ఊరుకొంది. అంటే 'ఏమిటి కర్తవ్యమా' అనే ఆలోచనవల్ల బుర్ర ఖాళీఅయిపోయిందన్న మాట. ఆ తర్వాత ఏమిటి చెయ్యడం అనే ఒక ప్రశ్నార్థకపు సంజ్ఞ బుర్రలో ప్రవేశించింది. అది ఆ అర్జునుణ్ణి ఒంటిపూసతేలులాగ ఊరంత వేధించడం మొదలు పెట్టింది.

"అప్పుడు శ్రీకృష్ణపరమాత్మ రెండవ రెండు కొటేషన్లమధ్య అంటున్నాడు. అంటే, ఆ రెండు సేనల మధ్య నిలబెట్టి అర్జునునికి తత్త్వబోధ చెయ్యడం మొదలుపెట్టెడు.

"ఓయి! వెర్రివాడా! నీకీ మానసిక దౌర్బల్యం ఎక్కడనుంచి అలవడిందోయి?" అని అడిగినప్పటి ఆశ్చర్యాన్ని సూచిస్తూ ఒక జండాకొయ్యా (!) జారీ చేశాడు. చూశారా! ఎంత భావగాంభీర్యమో! ఆతర్వాత తాపీగా ఒక్కటొక్కటిగా ఉపనిషత్సారమూ, ఆర్యమతమూలసిద్ధాంతాలను ఒకదానితర్వాత ఒకటి విశదపరస్తూ ఆ చుక్కలున్న జాగాని కాస్తా నింపివేస్తాడు. దాంతోటి భగవత్స్వరూపాన్ని గ్రహించిన అర్జునుడు ఆఖరి రెండు కొలేమన్ల మధ్య స్థలంలోనూ అత్యధికానందాశ్చర్యాలతో మూడు జండాకొయ్యలమధ్యా శ్రీ కృష్ణపరమాత్మను స్తోత్రం చేసి తన పదేహోన్ని బ్రాకెట్లమధ్యన పెట్టేసి అవతల శ్రమసైన్యానికి ఒక పెద్ద ఫుల్‌స్టాప్ పెట్టేస్తాడు.

"ఏం! ఇప్పుడర్థమయిందా దీని భావం! ఇప్పటికి తెలిసిందా దీని ఔచిత్యం! ఈనాటికి గ్రహించేగా దీని గొప్పతనం! ఇంకా నే నొక్క అర్థమే చెప్పేను. ఈ కావ్యానికే శృంగారకావ్యాల నన్నింటినీ తీసి దిద్దగల్గిన భావాలతో అన్వయించి వ్యాఖ్యానించవచ్చు. కాని ఇప్పుడు నేను చెప్పదలుచుకోలేదు కాంక్షి. అది మీ మీ తెలివితేటలనుబట్టి మీ అంతట మీరే మీ అభిరుచులకు తగినట్టు అన్వయించుకోడం శ్రేయస్కరం. దానివల్ల మరేమీ చికాకు లుండవు. మరేమీ దెబ్బలాట లుండవు.

"ఇన్నివిధాల నీకు విపులీకరించి చెప్తున్నప్పటికీ మీరు ఈ కవిత్వా లేమిటా అని హేళనగా చూస్తున్నట్టున్నారు. ఈలాగున అనుకుంటారనే నా ప్రారంభోపన్యాసంలో ఈ విషయంగూర్చి చాలా చర్చించేను. ఈపాటికి మీరు మరిచిపోయివుంటారని మళ్లీ చెప్తున్నాను.

పూర్వకవిత్వానికి వ్యాకరణం అన్న బంధనం ఎప్పుడు వచ్చిందో కాని, అప్పటినుండి యీ కవితాధార ఒకే కాలువగుండా, వాళ్లు త్రవ్విన కాలువ వెంబడే, వాళ్లు కట్టిన ఆనకట్టలమీంచే, వాళ్లు తెల్పిన కొలతలలోనే పారాలని చాలా నిర్బంధించి, కవితా నదియొక్క సహజత్వాన్ని, బహుముఖత్వాన్ని నాశనంచేశారు. కొన్నాళ్లవరకూ ఆ ప్రవాహం ఆవిధంగానే ప్రవహిస్తూఉండేది. ఆ ప్రవాహంలో కలియడానికి తగిన ఔన్నత్యంలేని నవీనకవులు స్వతంత్రించి పొర్లిపోయేరు. వారి సంకుచితత్వంనుంచి, నిరూపకత్వంనుంచి వేరుపడ్డామని గర్వించేరు. యతి, ప్రాస లెందుకన్నారు. దానిమీద కొంత రాద్ధాంతసిద్ధాంతాలు జరిగినప్పటికీ, ఆతర్వాత మీరే దానికి ఒప్పుకొన్నారు—గట్లు తెగిపోయినా నీరసేది ఉందిగదా అని.....రానురాను యతేకాదు, ప్రాసేకాదు, గణాలేకాదు, వ్యాకరణమేకాదు, ఏవిధంగానైనా, భావం నెట్లుడిచేస్తే అదే చాలన్నారు కొంతమంది. దానికీ మీరు ఒప్పుకొన్నారు— నెత్తిమీదపడ్డా రుచిగా ఉన్న మామిడిపండేకదా అని.....ఆతర్వాత వారు నెత్తిమీద తగలవలసినదానికి రుచికూడా యెందుకని గిరేసిన తాటిటెంకలనోటే కొట్టడం మొదలుపెట్టేరు. గద్యపద్యాలనే పిస్తోళ్ళతో కాళ్లనికూడా తెరవకడానికి బయలుదేరారు. దానికీ మీరు ఒప్పుకొని, అఖండసన్మానం చేస్తున్నారు. ఇన్నివిధాల బాధాకరంగాను, అసహ్యాకరంగాను ఉన్న సాహిత్యమును, ఇన్నివిధాల అభినందిస్తున్న మీయొక్క అనిర్వచనీయహృదయవిశాలత్వం మాకు కూడా విదితమయింది. ఏవి రాసినా, మీరు ఆనందంతో స్వీకరిస్తారని నాకు తెలుసును. అటువంటి సమయంలో కష్టతరమయిన ఆ పాతమార్గాల్లో ఎందుకు పోవడం? నూతనత్వానికే ఈ రోజుల్లో విలువ ఉన్నప్పుడూ, చాలా సులభసాధ్యంగా నూతనత్వం సంపాదించగలప్పుడూ ఇంక వేరే ఆలోచన యెందుకు?

"అయితే, మా కవిత్వంలో అర్థం లేదంటారా? ఇప్పటివరకూ పుట్టిన గ్రంథాల్లో అర్థముండి, నా గ్రంథాలయములోని గ్రంథాలలోనే అర్థముండదా! ఏదీ! ఆధునికకవులలో ఎవరైనా ఒకరి పుస్తకం తెచ్చి అందులో ఒక పాటో, పద్యమో, వచనపద్యమో పద్యవచనమో, సీసదండకమో, కార్డూలవెలదినో చదివి అర్థం చెప్పండి...మీ అర్థంతో వీరంతా ఏకీభవిస్తారేమో కనుక్కోండి...ఒక్కపద్యానికి యిద్దరు భిన్నవ్యక్తులు ఒకేవిధమైన అర్థము చెప్పేరూ అంటే, ఒక

వి:వయిన భావం కనబరచేరూ అంటే అది కవిత్వమే కాదు. అది ఒట్టి ప్రబంధమనే మనం విడిచిపెట్టేశారు. పూర్వమైనా, మాటలకు అర్థాలు మనం నియమించుకున్నవేనా, లేక బ్రహ్మ నోట్లోంచి నిఘంటువు లూడిపడ్డాయా ?.....మాటలకు అర్థాలు, భావాలు మనం నియమించుకున్నాం. మన తాతలు, ముత్తాతలు పెట్టిన అర్థాలతో మనం బంధీకులం కావడమెందుకు ? అందుచేత నాగరికత మారుతూన్నట్టే, కవితావిధానమూ మారుతుంది; అన్వయక్రమమూ మారుతుంది.

"ఇంకో ప్రశ్న ఎవరో కాగితంమీద వ్రాసి యిప్పుడే అందజేశారు- ఈ అక్షరకవిత్వ మనే ఈ Short-mouth (చిన్నముఖం) కవిత్వం ఏమిటీ అని.

"ఆహా ! నిజంగా ఇతనుకూడా గొప్ప కవి అయి ఉంటాడు. ఇలాంటి మాటలను మనం సామ్మ చేసుకుంటేనేగాని కవిత్వంలోను, భావంలోను సృష్టి అనేది ఉండదు. భావను మనమే సృష్టించుకోవాలి. ఈలాగ నాలుగేసిమాటలు క్రొత్తని రియారు చేస్తూ ఉంటే సృష్టికాదూ !...మనం సదా వాడుకుంటున్నప్పుడే భావనిస్తుంది. మనం వాడుకోడం మానేయగానే భావ నశించిపోతుంది. భావలకు మనమే సృష్టి, స్థితి, లయకారకులము. భావను నిలిపినా మనమే; ఖూనీచేసినా మనమే.

"ఇప్పుడిప్పుడే మాటకీ, అర్థానికీ సంబంధం లేదనిన్నీ, ఏమాటకైనా మన మానసికపరిపాకము ననుసరించి యిష్టమొచ్చిన అర్థ మివ్వవచ్చుననీ చెప్పేను. ఎటొచ్చీ, మాటలకు బదులు అక్షరాలను ఎందుకు వాడుతున్నారనా ?—అది అర్థంచేసుకుందుకు ఆధునిక నాగరికతలోని కొన్ని విషయాల నవగాహన చేసుకోవాలి.

"గత నూటయేభై సంవత్సరాలనుండి మన దేశంలోని నాగరికతా పరిణామంయొక్క విధానాన్ని ఎఱిగినవారు యిందులో చాలామంది ఉన్నారు. ముణుకులవరకూ చేతులున్న రవికలు పోయి, నెమ్మదినెమ్మదిగా చంకల్లోకి పోయే చేతులు గల బాడీలుగా తయారయిన ఈ కాలంలో, పాదాలనుకూడా కప్పే చీరకుచ్చెళ్లు కొద్దికొద్దిగా తీసిపోతూ మణుకుల మీదిమీదికి పోతూన్న గౌన్లగా మారుతూన్న ఈ కలికాలంలో, పిఱుదులమీద జీరాడు వాలుజడలు రానురాను చుట్టుకొని చుట్టుకొని మెడలమీద తారాడే కుంతలాలుగా తయారయిన ఈ రోజుల్లో, కాళ్లమొగ్గ్యా కట్టకోబడే పంచలు గొట్టాలుగా మారి, రోజురోజుకీ పాదములమీంచి పిక్కలమీదకీ, పిక్కలమీంచి మణుకులమీదికీ పోయి, అక్కడ కొన్నాళ్ళ దాకా నిక్కర్లుగా వెలసి, ప్రస్తుతము ఇంకా మీదిమీదికి డ్రాయర్ల పేరుతో పోతూ, ఇకముం దేనామం ధరిస్తాయో తెలియని యీ సమయంలో, బుగ్గలమీద నాలుగైదుచుట్లు తిరిగి, నిమ్మకాయలనుగూడ నిలుపగలిగే శక్తిగల మీసాలు వాలి సోలి మెల్లమెల్లగా నోటిచివరల చేరుకొని, అప్పటికీ స్థిరత్వం గాంచలేక ముక్కుక్రింద చేరి, పొడుంపట్టుతోటే ముక్కులోకి ఎగిరిపోయేందుకు నిలిచినట్టు లున్న ఫ్రెంచి కట్టులయి, ప్రస్తుతము క్లీన్‌కట్టు లవుతున్న ఈ రోజులలో, మధ్యపాపిడితో, ఉంగరాల జుట్టుతో, బుజాలమీద నల్లలాడే గిరజాలు నెమ్మదినెమ్మదిగా జన్మస్థానానికి దగ్గరపడి, జన్మమే లేనందుకుగాను, పట్టాల పుచ్చుకుంటున్న యీ శతాబ్దంలో, తాటిచెట్టంత పొడుగుండే మనుష్యులు, ద్వారాలకు కలపఖర్చని సమాధానమై ఆలోచించుకొని, బ్రహ్మదగ్గర పర్మిషన్ తీసుకొని, బెత్తెడుచొప్పునా జానెడుచొప్పునా, మూరెడుచొప్పునా బారెడుచొప్పునా క్రింక్రిందికి తగ్గుతూ, ఒగ్గుతూ ప్రస్తుతం భూమిలోపలనే కొలవాలేమోనన్న పరిమాణంలో కనపడుతూఉన్న శరీరాలు గల యీ నవయుగంలో, యింకా పొడుగుమాటలూ, చేంతాడు సమాసాలూ వెయ్యలేదని ఆక్షేపించడంలో ఏమీ అర్థంలేదని నా మనవి.

"ఇది Zero (శూన్యము)లో కలిసిపోయే యుగం. అందుచేత వారికి ఆదర్శప్రాయంగా మా కవిత్వం శూన్యానికి చాలా దగ్గరగా చేరి, తన దగ్గరకు రావడానికే క్రోవలో ఉన్న సమస్తలోకంవైపు సింహావలోకనం చేస్తూఉంటే ఆ జీరోవద్దకే వెళ్తూ, దాన్నే వెక్కిరిస్తున్నారూ అంటే దానిలో మీ ఉద్దేశ్యం

ఏమిటో నా కర్థంకాలేదు. ఇది మీరు పాక్షపాతిక మైన ఉద్దేశ్యములతో చూడడంవల్ల కలిగే దురభి ప్రాయమేకాని వేరుకాదు. ఏదైనా ఆనందించే శక్తి మీలోనే ఉంది. ఏదైనా నిరసించే శక్తీ మీలోనే ఉంది. పిచ్చివాడు గడ్డిపోచతోనే ఆనందం అనుభ విస్తాడు. లక్షాధికారికి వెయ్యిరూపాయిలు పైబడ్డా లాభం కనుపించడం లేదనే అంటాడు. ఆనందం పొందాలీ అంటే పై ఉదాహరణలోని గూఢార్థం గ్రహించండి.

"ఇంకా చాలామంది కవులున్నారు. మీరు మరేమీ ప్రశ్నించకుండా వారి పద్యాలు వింటూ, నా విమర్శన కానందిస్తూ, ఆఖరయిపోయినతర్వాత, 'దేముడా, రాముడా'అని ఇళ్లకుపోయి, హాయిగా పడుకుంటే, నేను చాలా సంతోషిస్తాను. ఇక 'నాక్షేపకకవి'గా రూపన్యసిస్తారు.

(శ్రీ బిందుకవిగారు లోపలికి పోతారు)

"అట్టే టైము వేస్టుచెయ్యదలుచుకోలేదు. ఈయనఘనత వర్ణనాతీతమైనను, అపారమైనను నాచేతనైనంతమట్టుకు వర్ణిస్తాను.

"ఈ కవి-సకలశాస్త్రార్థాంతరార్థావగ్రంబుల విపులంబుగా గ్రహించిన ఈ కవి-అన్ని ఆధునికగ్రంథాల సారమూ, ఈశ్వరుండు హాలాహలంబుకరణి కంఠంలో ఉంచుకొన్న ఈ కవి-అనన్యసామాన్య ప్రజ్ఞాసముపార్జి తానంత కీర్త్యాహ్లాదిత సమస్తలోకావలోకనంబులుకల ఈ కవి-ఆధునిక కవిత్వాలో నవ్యరీతులు చూపించిన ఈ కవి-అక్షరబిందుకవిత్వాలను మేళవించి యింపు గూర్చి, సొంపుదేర్చి, వంపుదీర్చి, సభాసదులందరూ కంపన నానందించు ఈ కవి- మా కవితాసమితికి మణి పూసలా వెలుగొందుచున్న యీ కవి-మీముందు యిప్పుడు మాట్లాడబోతూఉన్న ఈ కవిశారదుండు మీ ముందుకి నెమ్మదినెమ్మదిగా, గాలిలో యెగిరివచ్చి నట్లు తేలిగ్గా వస్తున్నాడు చూడండి! కొందరు దుష్టులు యీతని ఆక్షేపకకవిత్వాన్ని నత్తికవిత్వం అని ఆక్షేపిస్తూ ఉంటారు. ఇతని కొద్దిగా ఆ లోపం ఉన్నమాట వాస్తవమే. కాని, దాన్ని కవిత్వంలో ఉపయోగించుకొని, దానివల్లనే కవిత్వానికి క్రొత్త రుచి ఆపాదింపజేయడం ఎంత గొప్పదనమో మీరే గ్రహింతురుగాక! అంత గొప్పదన మున్నదిగాబట్టే ఈయన కవిత్వానికి ఇంకే శాస్త్రయుక్తమయిన పేరునూ పెట్టక యీతని పేరుతోనే దాన్నే పిలుస్తున్నారు.

"మనకు అట్టే టైము లేకపోవడంవల్లనూ, మీలో కొందరు సినిమా రెండవ ఆటకు టైమయిపో తోందని లేచి వెళ్లిపోదలచి, గేటుతాళాలు వేసి ఉండడంచేత విధిలేక ఆగిపోయిఉండడంచేతనూ మీకు అట్టేశ్రమ యీయకుండా ఉండేందుకు ఈయనగార్ని ఒక్కపద్యమే చదవమంటాను. అది ఆయన ఏవిధంగా అమ్మవేయిస్తాడో, ఆవిధంగా బోర్డుమీద వ్రాసి మీకు చూపిస్తాను.

(శ్రీ ఆక్షేపకకవిగారు ప్రవేశించి చదువుతారు)

క.....క.....క.....క.—కం.....
కం.....కం.....కంపు!.....కంపు!!

(సభాసదులందరూ ఒక్కమారు గొల్లుమంటారు)

"అయ్యా! మళ్లా మీరు అల్లరిపెట్టడం మొదలు పెట్టేరు. మీ కిదో తమాషాగా ఉంది. ఇందులో అర్థ మును గ్రహించడానికి ప్రయత్నించాలిగాని, అనవ సరంగా గోలచేసుకుంటూ ఉంటే లాభం ఏమిటి? ఇంతకీ యీ కవిగారు ఉపోద్ఘాతపద్యమే చదివేరు. ఇలాంటి కవిత్వం ఆధునిక కవిత్వంలో చాలాచోట్ల ఉన్నదే! అది కొంచెమైనా గ్రంథపరిచయమున్న వారి కర్థమవుతుంది. ఈలాంటి లైన్లలోనే నడిచిన కవిత్వం ఎక్కడున్నదో!...

"యింతకూ మీరు యిందులో భావార్థం గ్రహించలేకపోయేరు. తత్త్వార్థం గ్రహించలేకపోయేరు. అది నాలాంటివాళ్లు విడమర్చి అరటిపండులాగ ఒలిచి విశదీకరిస్తే అప్పుడు మీరు ఆకళించడానికి ప్రయత్ని స్తారన్నమాట!

"సరే! ఇందులో భావార్థం ఏమిటంటే— 'క' అంటే 'ఖ' అన్నమాట. 'క, ఖయో రభేదః' అని యిప్పటి వ్యాకరణసూత్రము. తెలుగులో ఒత్తు అక్షరములు లేవుకాబట్టి, నోరుతిరుగనివాళ్లు 'క'కార

మును 'ఖ'కారంగాను, 'ఖ'కారమును 'క'కారం గాను ఉచ్చరిస్తారు. అది ఉచ్చారణదోషమే. 'క' కారం ఉండవలసినచోట్ల 'ఖ'కారం చాలాచోట్ల ఆధునికకవిత్వంలో 'నీఖు' 'నాఖు' అని ఉపయోగంలో ఉన్నాయి. 'ఖ' అంటే 'ఆకాశం'. అవునా! అటువంటి ఆకాశంలోంచి Gradual గా—అదే గొప్పతనం. అందులో ఆయన బిందుకవిత్వం ఉపయోగించవలసిన ఏచుక్కకద్ద ఆపాలో తెలియని సందిగ్ధావస్థలో ఒక్కొక్క చుక్కమీంచి ముందుముందుకు పోయి, అక్కడా ఆకాశాన్ని చూసి, యింకా ఆగలేక, అక్కడా యిదే అవస్థ పొంది—ఈ విధంగా చుక్కలన్నీ క్రమేపీ జరిగిన క్రియ, సంకేతాత్మకమైన జన్మ నిరూపింపబడుతుంది. అటువంటి ఆకాశం నుంచి జన్మించిన దేమిటంటే కం.....కం అంటే నీరు అనికదా! చూశారా!...ఆ ఆకాశంనుంచి క్రిందకు కర్షింపబడిన నీరు...పారి...పారి—ఇందులో బిందుకవిత్వం ఏవిధంగా సాయంచేస్తుందో చూడండి—అంటేగాదు, 'ఆకాశంలోంచి నీరు ఉద్భవించింది' అంటే 'అవునుగామోసు'ని చల్లగా ఊరుకుంటాం... అంటేగాని, ఆ పుట్టడంలో ఆకాశం అనుభవించిన ప్రసవవేదనగాని, ఆరాటంగాని విదితమవుతుందా?... అబ్బే!...అది యిలాంటి కవిత్వంలోనే గోచరిస్తుంది. ఆ 'కం' అంటే నీరు ఒంచోట చేరి సరస్సుగా తయారయి...అందులోంచి 'కంపు' అనేది ఉద్భవించిందన్నమాట! 'కంపు'అంటే 'దుర్గంధం'అని మీరు అనుకుంటున్నారుకామోసు. ఆ అర్థం లేకపోలేదు. ఈ పద్యంలో శ్లేషకూడ ఉంది. ప్రస్తుతార్థం ఏమిటంటే, 'కంపు'-'పు'అనేది పువ్వు అనే అర్థమిస్తుంది. యిందాకా అక్షరకవిత్వంలో అది ఏవిధంగా సాధ్యపడుతుందో చెప్పుకొన్నాం. అంటే, 'కంపు'—కం పువ్వు, నీటిపువ్వు, అంటే 'కమల'మన్నమాట! ఈ విధంగా వ్యుత్పత్తి చెప్పుకోవాలి. ఈ ఆకాశోద్భవ జలోద్భవ కమలమురలె నాకవిత్వంకూడ మానసాకాశంలో విహరిస్తూ భావమేఘాలు వర్షించ, నాహృదయ తలమున గంభీరజలాశయముగా మారి, అందులో ఈ విధంగా 'కంపు'అంటే 'కవితాపుష్పము' ఉద్భవించి, తన సౌరభమును నలుదిక్కులా వెదజల్లుతోంది అనే భావార్థం...ఇది స్వీకరుపాగడ్త. ఇందులోనే కుకవి దూషణంకూడ పేరుపేరు కరుసనా నిఓడీకృతమయి ఉంది. అది మీకే అర్థం చేసుకుంటుకు విడిచిపెట్టేసేను.

"అంతేకాక, యిది ప్రథమపద్యం గాబట్టి భగవత్స్తుతిగూడ యిందులోనే ఉంది. "ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరం, సర్వదేవ నమస్కారః కేశవంప్రతి గచ్ఛతి" అనే దానికి స్వేచ్ఛానువాదం. 'కేశవం ప్రతిగచ్ఛతి' అన్నదానికి యింగులో ఏభావమూ లేదని అడుగుతారా? లేకేం! ఏ దేవునికైనా నమస్కారం ఎందుకు చేస్తాము?...మన ఎనోరథాలు ఫలించాలనేకదా! ఎప్పుడైతే పుష్పించడం మొగలెట్టిందో అప్పుడే ఫలవంత మవుతుందని ఊహార్థం—ఇదే పద్ధతి అన్వయించుకోడానికి. ఎవరిని పొగడదలుచుకొన్నా, ఎవరిని తిట్టదలుచుకొన్నా దానికి తగినట్టు అన్వయించుకోవచ్చు. అది మన శక్తిమీదనే ఆధారపడివుంటుంది. వృక్షమనేది ఫలాన్నిస్తుంది. దానిని మనం ఆవిధంగానే భక్షిస్తామో, ఉడికబెట్టుకొంటామో, ముగ్గబెట్టుకుంటామో, మాగవేసుకుంటామో, కుళ్లబెట్టుకుంటామో- అది మన యిష్టం మీదనే ఆధారపడిఉంటుంది.

"మీలో ఈ కుకవిత్వాన్ని ఇంకా వినాలని కుతూహలపడుతున్నవారు చాలామందున్నట్టున్నారు. కాని, కాలం దగ్గరపడింది కాబట్టి, కడుపుకొండ తొందరగా జరిపిస్తున్నందుకు క్షమించండి.

(శ్రీ అక్షరకవిగారు నిష్క్రమిస్తారు)

"ఇంక శ్రీ మూకకవిగారు ప్రసంగిస్తారు. ఎంతటి మూకనైనా యిట్టే రంజింపజేయగల ఈయన కవిత్వం సంగతి నేను ముందుగా చెప్పను.....ఈ విధమైన కవిత్వం ఏ భాషలో కూడా లేదని చెప్పడానికి నేను ఎంతో గర్విస్తున్నాను. ఈ కవితామృతాన్ని మీరు స్వకుంగా ఆస్వాదించినపిమ్మటనే దాని మంచిచెడ్డలు మీతో నేను ఆలోచిస్తాను.

(శ్రీ మూకకవిగారు వచ్చి కుర్చీలో కూర్చుంటారు. 'ఏమిటి చెప్తాడో' అని అందరూ ఆశ్చర్యంగా చూస్తూఉంటారు. ఒక్కొక్క నిమిషమే గడుస్తోంది. సభలో విజిల్సు, చప్పట్లు, కేకలు బయలుదేరుతున్నాయి. కొంతమంది రామభిజన చెయ్యడం మొదలుపెట్టేరు. మరికొందరు 'యిదెక్కడి బాధరోయ్' అని తిట్టుకోడం మొదలుపెట్టేరు. యింకా చెప్పాడుకామోసుని కొంతమంది అలాగే ఆఖరుదాకా నోళ్లు వెళ్లబెట్టుకొని, చూస్తూ కూర్చున్నారు. పదినిముషాలు గడిచేయి....శ్రీ మూకకవిగారు లోనికి వెళ్లిపోతారు)

('Excellent' అని కొందరు, 'వన్స్‌మోర్' అని కొందరు, 'నోమోర్' అని కొందరు, 'అద్భుతం'

అని కొందరు, 'ఏకబాధరోయ్' అని కొందరు, 'పీడ వదలిందని' కొందరూ రకరకాల అభిప్రాయాలు జారీ చేశారు. మొత్తానికి సభ అంతటా సంచలనం కలిగింది)

"ఈ కవిత్వాన్ని మీరంతా విన్నారుగనుక— (మళ్లా సభ అంతా ఫక్కున నవ్వుతుంది)— Silence Please! దీన్ని నేను కవిత్వం అనడం మీకు ఆశ్చర్యంగానే ఉండవచ్చు. యీ సంగతి మీకు ముందుగానే చెప్పేనుగాని మీరు తిన్నగా అర్థంచేసు కోలేదు. కవిత్వంలో ముఖ్యమైనవి భావం, రసం. ఆరెండూ కలుగుతూన్నప్పుడు మాటలుంటవలసిన అవసరమేమిటి? మాటలున్న కవిత్వంలోనే ఒకని అర్థం ఒకనికి పొసగనప్పుడు, మాటలయొక్క ఆధిక్యత యేమి ఉంది? చూడండి—ఈయన కూర్చున్న పది నిముషాలలోనూ సభలో ఎంత సంచలనం కలిగిందో! ఎంతటి హాస్యరసభూయిష్ఠమైన కావ్యమైనా యింతటి ఆనందాన్ని యివ్వగలదూ? యింతటి రసాన్ని వర్షించగలదూ? యింతటి అర్థబాహుళ్యాన్ని ప్రకటించగలదూ? పూర్వపు కవులు అయినా, శేషము ఉపయోగించినప్పుడు, రెండో, మూడో, మహా అయితే నాలుగో అర్థాలు చెప్పుకోగలిగేరు. ఆధునికకవుల్లో కూడ నానార్థాలకూ ఒక పరిమితి ఉంది. కాని యీయన కవిత్వంలోని విధార్థాలకు లెక్కే లేదు. ఈ సభలో ఎంతమంది ఉన్నారో అందరూ వారికి తగినట్టు ఒక విధంగానో, రెండు విధాలుగానో, అనేక విధాలుగానో అన్వయించుకొన్నారూ అంటే, ఈతన కావ్యంలోని అర్థబాహుళ్యంయొక్క విశాలత్వం మీకే బోధపడుతుంది.

"మీలో కొందరితని రూపు చూసి, ఆనందించి హర్షిస్తూవుండగా, యితని కవిత్వంలోని ఏ భావమో గాని, కొంతమందిలో భక్తిని రేకెత్తించి, వారిచేత రామభజన చేయించింది. యితని ఏ అసచ్చారిత వాక్కో కొందరిలో విషాదాన్ని కలుగజేసింది. కొందరికి ఈయన్ని చూడగానే ఏ మూగబంధువులో జ్ఞాపకానికివచ్చి మనోక్షేత్రంముందు తాండవమాడ్డం మొదలుపెట్టి ఉంటారు. కొందరు 'ఏమిటి చెప్తాడో' అని ఆఖరిదాకా చూసి, ఆఖరికి నోళ్లు వెళ్లబెట్టేరు. అంటే అలాంటివారికి భగవంతునియొక్క నిజస్వరూపం కనిపించిందన్నమాట. నేను చెప్పలేదూ! ప్రతివాడికీ ఏదో ఒక్కొక్క ఉద్దేశ్యం కలిగి వుంటుంది. అది ఇంకొకడి ఉద్దేశ్యంతో ఎప్పటికీ సరిపోయిఉండదు. తన కవిత్వంవల్ల ఏమనిషిలో ఏభావం గోచరించిందో, కవిగూడా చెప్పలేడు. విమర్శకుడు కూడా విన్నవించలేడు. విన్నవారుకూడ విశదపరచలేరు.....ఇటువంటి చిత్రకవిత్వం ఎప్పుడైనా విన్నారా?

"అనవసరంగా దస్తాలకి దస్తాలు దండుగజేసి, ఎవ్వరికీ అర్థంకాకుండా వ్రాసి, దానికి ప్రింటింగుకు ఊరంతడబ్బుపోసి, ఎడ్వర్టయిజుమెంటుకి మరోయింత ఖర్చుపెట్టి, అప్పటికీ చెలామణీ కాకపోతే, యిలాంటి చెత్తకవులు కొంతమంది కూడబలుకొని, ఒకళ్ల గ్రంథాల నొకరు పొగడుకొంటూ, పత్రికలవాళ్లకు డబ్బిచ్చి పబ్లిసిటీచేయించుకుంటూ, అప్పటికీ పబ్లిక్కులో ఆదరం పొందలేక, బాధలుపడే ఆధునిక కవులయొక్క తుచ్ఛాక్షర పూర్ణానర్థకవిత్వాలకంటే నిరక్షరమై, అశక్యమై, అగ్రాహ్యమైన ఈతని ఆశుకవిత్వం ఎంతటి అర్థసుసంపన్నత్వాన్ని కనబరిచిందో మీ అందరికూ విదితమే—ఇతనియొక్క కవిత్వంలోని గొప్పతనం యిప్పుడు మీ కర్థంకాదు. యింటిదగ్గిర సావకాశంగా ఒక అరగంట ఆలోచించి దీన్ని ఆధునికకవిత్వంతో పోల్చిచూచినప్పుడే యిందులోని ఘనత కొద్దిగానైనా మీకు తేటపడుతుంది.

"నా జీవితమంతా కవితావిమర్శనలోనే గడిపిన నేను నాసమాజంలోని కవులకేగాక, మిగిలిన యువకకవులకు, బాలకవులకు, స్త్రీకవులకు, వృద్ధకవులకు, నవ్యకవులకు, సవ్యకవులకు, శ్మశానకవులకు, విప్లవకవులకు—అందరకూ యిచ్చే సలహా ఏమిటంటే, అతిసూక్ష్మమైన యీకవితావిధానాన్ని వారూ అవలంబిస్తే, లోకం ఎంతో ముందుకువచ్చి, సక్రమ మార్గంలో నడిచి, గొప్ప ఆశయాలను గ్రహించి, ఎంతో సుఖించగలదనే.

"క్షమించండి—యిప్పటికే చాలాటైము అయిపోయింది. ఇంకా కవిత్వంతండి గణితశాస్త్రము, చిత్రలేఖనము, గానకళ, మిగిలిన అఖిల శాస్త్రములు, అనంతకళలు ఏవిధంగా ఉద్భవించేయో చెప్పదామనుకొన్నాను. కాని, నాకు ఈ గ్రామే, మరో అరగంటపోయింతర్వాత ఇంకొక చిన్నపనుండడంవల్ల, మీ కొకప్పుడెప్పుడైనా, యిటువంటి సదవకాశం కలిగినప్పుడు మనవిచేసుకుంటాను. యింతతో నా ఉపన్యాసం ఆఖరు. అందరూ చప్పట్లు కొట్టండి"

(అని తను చప్పట్లుకొడుతూ కూర్చుంటాడు)